దొంగిలించిన బైక్‌ల స్వాధీనం

మాదాపూర్‌: దొంగిలించిన బైక్‌లను పట్టుకుని ఇద్దరు నిందితులను అరెస్ట్‌ చేసిన ఘటన మాదాపూర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో మంగళవారం జరిగింది. ఇన్‌స్పెక్టర్‌ కృష్ణమోహన్‌ తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడకు చెందిన ఇద్దరు నిందితులు ఓర్సు వెంకట్‌ (19) బోరబండలో నివాసముంటూ సెంట్రింగ్‌ కూలీగా పనిచేస్తున్నాడు. చంద్రగిరి జీవన్‌(18) ప్రైవేట్‌ కంపెనీలో ఆఫీస్‌ బాయ్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 14న మాదాపూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని పర్వత్‌నగర్‌ చౌరస్తా వద్ద పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో భాగంగా అటుగా వెళ్తున్న వారిని ఆపి వివరాలు అడుగగా తప్పించుకునే ప్రయత్నం చేయడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా ద్విచక్ర వాహనాలను దొంగిలించినట్టు ఒప్పుకున్నారు. దీంతో వారి నుంచి రూ. 2.80 లక్షల విలువైన 5 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఓర్సు వెంకట్‌ మాదాపూర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో గతంలో హాస్టల్స్‌లో ల్యాప్‌టాప్‌లు, మొబైల్‌ఫోన్లు కూడా చోరీలకు పాల్పడినట్టు తెలిపారు. నిందితులు స్వాధీనం చేసుకున్న 5 బైక్‌లపై మాదాపూర్‌ పోలీస్‌స్టేషన్‌లో 3 కేసులు, ఎస్‌ఆర్‌నగర్‌లో 2 కేసులు ఉన్నట్లు తెలిపారు.

వాలీబాల్‌ మ్యాచ్‌ను తిలకించిన విద్యార్థులు

గచ్చిబౌలి: జీఎంసీ బాలయోగి స్టేడియంలో నిర్వహిస్తున్న జాతీయ వాలీబాల్‌ పోటీలను రాయదుర్గంలోని ఎఫ్‌డీడీఐ–హైదరాబాద్‌ ఫ్యాకల్టీ, విద్యార్థులు మంగళవారం తిలకించారు. ఈ సందర్భంగా స్టేడియంలో అధికారిక ఈవెంట్‌ టీషర్టులను ఎఫ్‌డీడీఐ–హెచ్‌ ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ ఎస్‌ తేజ్‌లోహిత్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు ఫ్యాకల్టీ, అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వంద శాతం ఆస్తి పన్ను వసూలు చేయాలి


ఆస్తి పన్ను వసూళ్లపై సమీక్షిస్తున్న జెడీసీ హేమంత్‌ బోర్థడే

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి జోన్‌ పరిధిలో వంద శాతం ఆస్తి పన్ను వసూలు చేయాలని జోనల్‌ కమిషనర్‌ హేమంత్‌ బోర్ఖడే ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ వెస్ట్‌జోన్‌ పరిధిలో ఆస్తి పన్ను వసూళ్ల పురోగతిపై డిప్యూటీ కమిషనర్లు, పన్ను విభాగం ఏఎంసీలు, ట్యాక్స్‌ ఇన్‌స్పెక్టర్లతో మంగళవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2025–26 ఆర్థిక సంవత్సరానికి రూ.575.25 కోట్ల లక్ష్యం కాగా ఇప్పటివరకు రూ.326.58 కోట్లు వసూలైందన్నారు. ఇక నుంచి నిరంతరం సమీక్ష ఉంటుందని అలసత్వం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. జోన్‌ పరిధిలోని శేరిలింగంపల్లి, చందానగర్‌, పటాన్‌చెరు ఆర్‌సీపురం సర్కిళ్ల వారీగా ఇచ్చిన లక్ష్యంతోపాటు చేరుకున్న లక్ష్యాన్ని 34 డాకెట్ల వారీగా ఆయన సమీక్షించారు. కార్యక్రమంలో పలువురు డిప్యూటీ కమిషనర్లు, ఏఎంసీలు, ట్యాక్స్‌ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


పౌష్టికాహారం తీసుకుంటామని విద్యార్థినులతో ప్రమాణం చేయిస్తున్న సీడీపీఓ కవిత, ప్రిన్సిపాల్‌ కల్పన

గచ్చిబౌలి: పోషకాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని ఐసీడీఎస్‌ శేరిలింగంపల్లి ప్రాజెక్ట్‌ సీడీపీఓ కవిత సూచించారు. గచ్చిబౌలి డివిజన్‌ గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాలలో పోషకాహార మాసం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆరోగ్యంగా ఉంటే మంచిగా చదువుకునే అవకాశం ఉంటుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులకు పోషకాహారం, మందులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పిస్తూనే వారికి పౌష్టికాహారం కూడా అందిస్తున్నామని, ఇంటి సమీపంలో ఉండే చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని సూచించారు. ప్రిన్సిపాల్‌ కల్పన విద్యార్థినులకు అందించే భోజనం, కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు. అనంతరం పౌష్టికాహారం ప్రాధాన్యత వివరిస్తూ వారితో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌ జ్యోతిశ్రీ, టీచర్లు నీలవేణి, శారద, శివలత, గురుకుల కళాశాల టీచర్లు పాల్గొన్నారు.

పునరుద్ధరణతో చెరువుకు పునర్వైభవం



చందానగర్‌ : హఫీజ్‌పేట్‌ డివిజన్‌ పరిధిలోని కాయిదమ్మ కుంట చెరువు పునరుద్ధరణ పనులతో చెరువుకు పునర్వైభవం వస్తుందని పీఏసీ చైర్మన్‌, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. నెక్సస్‌ సెలెక్ట్‌ మాల్స్‌ సంస్థ సీఎస్‌ఆర్‌ ఫండ్స్‌తో మల్లిగవాడ్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో చేపట్టిన పునరుద్ధరణ పనులను ఇరిగేషన్‌ అధికారులతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. చెరువులో మురుగు నీరు కలవకుండా ప్రత్యేక పైప్‌లైన్‌ వేయాలని సూచించారు. నెక్సస్‌ సెలెక్ట్‌ మాల్స్‌ వారు సీఎస్‌ఆర్‌ ఫండ్‌ ద్వారా మల్లిగవాడ్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో సుందరీకరణ చేపట్టేందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గౌతమ్‌ గౌడ్‌, అక్తర్‌, సుదేష్‌, సీఎస్‌ఆర్‌ ఐటీ సంస్థ ప్రతినిధులు చైతన్య, రాము, కాలనీ వాసులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో బూత్‌స్థాయి ప్రచారమే కీలకం

రాయదుర్గం: ఎన్నికల్లో బూత్‌ స్థాయి ప్రచారమే కీలకమని గచ్చిబౌలి కార్పొరేటర్‌ గంగాధర్‌ రెడ్డి పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని బూత్‌ కమిటీ సమావేశాన్ని నానక్‌రాంగూడలోని డివిజన్‌ పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించి నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బూత్‌స్థాయిలో ఎన్నికల ప్రచారం నిర్వహించడంపై అవగాహన కల్పించేందుకే ఈ సమావేశాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు పార్టీ విజయమే లక్ష్యంగా ఇంటింటికీ తిరుగుతూ ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరించాలని సూచించారు. అలాగే కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌ వైఫల్యాలను కూడా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. కారక్రమంలో డివిజన్‌ అధ్యక్షుడు శివాసింగ్‌, నాయకులు రాకేశ్‌, కుల్‌దీప్‌ సింగ్‌, సునీల్‌సింగ్‌, శ్యామ్‌రాథోడ్‌, నర్సింగ్‌నాయక్‌, శ్రీశైలం, గోపాల్‌, సహదేవ్‌, సాయినాథ్‌, వంశీగౌడ్‌, విక్రమ్‌గౌడ్‌, విష్ణు, రాధాకృష్ణయాదవ్‌, హన్మంతు నాయక్‌, కృష్ణ, నరేందర్‌, శ్యామ్‌యాదవ్‌, శ్రీకాంత్‌రెడ్డి, దినేష్‌యాదవ్‌, దయాకర్‌, కిషన్‌ పాల్గొన్నారు.

స్కేటింగ్‌లో హెచ్‌సీయూ విద్యార్థి సత్తా


నైద్రుమ్‌వారణాసి

రాయదుర్గం: గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్‌ ఏడో తరగతి విద్యార్థి నైద్రుమ్‌వారణాసి జిల్లాస్థాయి స్కేటింగ్‌ పోటీల్లో ప్రతిభ చూపాడు. 1000 మీటర్ల రోడ్‌ రేసులో బంగారు పతకం, 500 మీటర్ల రింక్‌ రేసులో వెండి, 1000 మీటర్ల రింక్‌ రేసులో కాంస్య పతకం గెలుచుకుని రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించాడు. క్యాంపస్‌ స్కూల్‌లో ప్రిన్సిపాల్‌ మురళి, ఫిజికల్‌ డైరెక్టర్‌ సతీశ్‌గౌడ్‌ నైద్రుమ్‌వారణాసిని మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర, జాతీయస్థాయిలోనూ అత్యుత్తమ ప్రదర్శన చేసి మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రహరీ తొలగించాలని నిరసన



శేరిలింగంపల్లి: రోడ్డును కబ్జా చేసిన నిర్మించిన ప్రహరీని వెంటనే తొలగించి రాకపోకలు సుగుమం చేయాలని కోరుతూ పాపిరెడ్డినగర్‌వాసులు మంగళవారం కాలనీలోని రోడ్డుపై నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పాపిరెడ్డినగర్‌ అధ్యక్షుడు బద్దం కొండల్‌రెడ్డి మాట్లాడుతూ.. కాలనీలోని 1827 ప్లాట్‌ వారు రోడ్డును కబ్జా చేసి ప్రహరీ నిర్మించారన్నారు. ఈ విషయమై జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా హైడ్రా, జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు ఎస్పీ రెడ్డి, బసవరాజు, కుమార్‌, శ్రీనివాస్‌, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ ప్రొఫెసర్‌కు అరుదైన అవకాశం


శ్రీనివాసరావు

రాయదుర్గం: హెచ్‌సీయూలోని స్కూల్‌ ఆఫ్‌ కెమిస్ట్రీ సింథటిక్‌ ఆర్గానిక్‌ కెమిస్ట్‌ ప్రొఫెసర్‌ శ్రీనివాస రావు యరగోర్లకు రెండు ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో అరుదైన అవకాశం కలిగింది. రాయల్‌ సొసైటీ ఆఫ్‌ కెమిస్ట్రీ (ఎఫ్‌ఆర్‌ఎస్‌సీ), తెలంగాణ అకాడమీ ఆఫ్‌ సైన్సెస్‌(ఎఫ్‌టీఏఎస్‌)లలో ఫెలోగా ఎన్నికయ్యారు. డాక్టర్‌ శ్రీనివాసరావు సింథటిక్‌ ఆర్గానిక్‌ కెమిస్ట్రీ, టీటీ–యాక్టివేటెడ్‌ ఆల్కహాల్‌ను ఉపయోగించి కొత్త ప్రతి చర్యలను అభివృద్ధి చేయడం, మల్టీకంపొనెంట్‌ రియాక్షన్లు, సీ–హెచ్‌ ఫంక్షనలైజేషన్‌, మెకనోకెమిస్ట్రీ వంటి అంశాల్లో నిష్ణాతుడు. హెచ్‌సీయూలో ఫ్యాకల్టీగా చేరే ముందు ఆయన సెంట్రల్‌ యూనివర్శిటీ ఆఫ్‌ రాజస్థాన్‌లో 5 ఏళ్లు పనిచేశారు. డాక్టర్‌ శ్రీనివాసరావు 2022లో చాన్స్‌లర్‌ అవార్డును అందుకున్నారు. ఇండియన్‌ అకాడమీ ఆఫ్‌ సైన్సెస్‌కు 2019లో అసోసియేట్‌ ఫెలోగా ఎన్నికయ్యారు. డీఎస్‌టీ నుంచి ఫాస్ట్‌ ట్రాక్‌ యంగ్‌ సైంటిస్ట్‌ గ్రాంట్‌ను కూడా పొందారు.